క్లుప్తంగా

నేడు ప్రజావేదిక

లోకేశ్వరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సోలమాన్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో గత 21 నెలల్లో రూ.7.67 కోట్లతో ఉపాధిహామీ పనులు జరుగగా.. ఈనెల 14 వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో తయారు చేసిన నివేదికలను ప్రజావేదికలో వెల్లడించనున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూలీలు హాజరవాలని వారు కోరారు.

తీజ్ ఉత్సవాలు



వేడుకలో పాల్గొన్న గ్రామస్తులు

మామడ: మండలంలోని మామడ తండాలో గురువారం తీజ్ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారా మహిళలు, చిన్నారులు ప్రత్యేక వేషధారణలో పాటలు పాడి నృత్యాలు చేశారు. సర్పంచ్ హన్మాగౌడ్, గ్రామస్తులు గంగారాం, కిషన్, వినోద్‌కుమార్, వసంత్‌రావు, సురేశ్ తదితరులున్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

కడెం: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం నిర్వహించాల్సిన కడెం మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేశారు. టెట్ పరీక్షకు ఆయా శాఖల అధికారులకు డ్యూటీలు ఉన్నందున సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ అలెగ్జాండర్ ప్రకటించారు. స్థానిక ఎమ్మెల్యే రేఖానాయక్ వస్తుందనే సమాచారంతో కావాలనే సమావేశం వాయిదా వేశారని స్థానికులు ఆరోపించారు.

అమర వీరులకు నివాళి

భైంసాటౌన్: జమ్మూ కాశ్మీర్‌లో ముష్కరుల కాల్పుల్లో అమరులైన జవాన్లకు గురువారం భైంసాలో నివాళులర్పించారు. పట్టణంలోని శ్రీమేధా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించి అంజలి ఘటించారు. సైనికుడిని రక్షించబోయి ప్రాణాలొదిలిన ఆర్మీ డాగ్ కెంట్‌కు సైతం నివాళులర్పించారు. జాదవ్ పుండలిక్ రావు పాటిల్, డైరెక్టర్ ప్రేమానంద్ పాటిల్, కరస్పాండెంట్ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సాయినాథ్ పాటిల్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో గణేశుడి వేడుకలు



విద్యార్థులతో చైర్మన్ నరేందర్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు గణేశుడి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ వి ద్యార్థులు నినాదాలు చేశారు. చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పండుగల ప్రాధాన్యత వివరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూట్‌మ్యాప్ పరిశీలన

ఖానాపూర్: గణేశుడి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో నిర్వహించే శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను గురువారం ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించా రు. అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలు తొలగించి గుంతల్లో మట్టి పూడ్చాలని నిర్ణయించారు. మున్సిపల్ చైర్మన్ రాజేందర్, సీఐ మోహన్, తహసీల్దార్ పరిమళ్ భౌమిక్, కమిషనర్ మనోహర్, ఎంపీడీవో మల్లేశ్, ఎస్సై శంకర్, ఏడీఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

కుభీర్: లోక్ అదాలత్‌లో జిల్లాలోనే ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేసినందుకు కుభీర్ ఎస్సై ఎండీ.షరీఫ్ ఇటీవల అవార్డు అందుకున్నారు. గురువారం పలు గ్రామాల ప్రజలు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైని స న్మానించారు. విజయ్, నాగలింగం, నిఖిల్, రా జన్న, కల్యాణ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

హిందీ భాషా దినోత్సవం

సారంగాపూర్: మండలంలోని జామ్ సాంఘీక సంక్షేమశాఖ బాలికల గురుకుల విద్యాలయంలో గురువారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ భాషలో క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ రమాకల్యాణి, సంధ్యారాణి, వైశాలి, సిబ్బంది తదితరులున్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో హిందీ దివస్ నిర్వహించారు. హిందీ పండితులు మురళి, పద్మ, పింటు శర్మ హిందీ భాష గొప్పతనం వివరించారు.



తానూరు: భోసిలో హనుమాన్ ఆలయం వద్ద ఎడ్ల ప్రదర్శన



ముధోల్‌లో తన ఎడ్లతో ఓ రైతు



కుభీర్‌లో ఆలయం వద్దకు ర్యాలీగా వెళ్తున్న గ్రామస్తులు

ఘనంగా పొలాల పండుగ

రైతులు ఎంతో పవిత్రంగా భావించే పొలాల అమావాస్య పండుగను గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తాము కన్నబిడ్డల్లాగా చూసుకునే బసవన్నలను అలంకరించి నందీశ్వరుడిలా తయారు చేశారు. ఆయా గ్రామాల్లోని హనుమాన్, మహాదేవ్, విఠలేశ్వర ఆలయాల చుట్టూ ఎడ్లతో ప్రదక్షిణలు చేయించి పూజలు చేశారు. అనంతరం ఇంటికి తీసుకొచ్చిన బసవన్నలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఎడ్లు లేని వారు ఇళ్లలో మట్టితో తయారు చేసిన ఎడ్ల ప్రతిమలకు మంగళహారతులిచ్చి పూజలు చేశారు. తమ పాడి, పశుసంపద బాగుండాలని మొక్కుకున్నారు. భైంసాలోని కిసాన్‌గల్లిలో నేతాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్ద ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, సీఐ శ్రీను, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావుపటేల్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఎడ్లకు హారతి ఇచ్చి పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



భైంసారూరల్: మహాగాంలో పూజలు చేసేందుకు ఆలయానికి బసవన్నలతో వెళ్తున్న రైతులు



భైంసాలో పూజలు చేస్తున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, సీఐ శ్రీను



కుంటాలలో ఎడ్లతో రైతులు



లోకేశ్వరం: కన్కపూర్ హనుమాన్ మందిరం వద్ద..



మామడ: లింగాపూర్‌లో ఎడ్లతో ఓ రైతు



పెంబి : తమ ఇంటి వద్ద ఎడ్లతో బాలుడు



దిలావర్‌పూర్: శ్రీ పాపహరేశ్వరాలయంలో పూజలు

సంక్షిప్త వార్తలు

చర్చి స్థలం కబ్జా చేశారని ఫిర్యాదు

కడెం: మండల కేంద్రంలోని ఆశీర్వాద ప్రార్థన గోపురం చర్చి స్థలం కొందరు కబ్జా చేశారని పాస్టర్ పాల్ కరుణాకర్ ఆరోపించారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని గురువారం పాస్టర్లతో కలిసి తహసీల్దార్ రాజేశ్వరికి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్, రాజ్‌బాబు, శ్యాముల్, రవి తదితరులు ఉన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు వినతి

నిర్మల్‌టౌన్: తమ కాలనీలో పిచ్చి మొక్కలు తొలగించి.. రోడ్డు వ్యవస్థ బాగు చేయాలని పట్టణంలోని బేస్తవార్‌పేట్ కాలనీవాసులు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌కు విన్నవించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో వారిని కలిసి సమస్యలు వివరించారు. అన్ని వార్డుల్లో పలు చర్యలు చేపడుతున్నట్లు చైర్మన్ తెలిపారు.

రేపు శాంతికమిటీ సమావేశం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో ఉన్న సీఎంరావు ఫంక్షన్‌హాల్‌లో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పరిమళ్ భౌమిక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి స్థానిక అధికారులు, శాంతికమిటీ సభ్యులు, పట్టణ, మండల ప్రజలు హాజరు కావాలని కోరారు.

నియామకం

నిర్మల్‌టౌన్: ఆమ్ ఆద్మీ పార్టీ దిలావర్‌పూర్ మండల కోఆర్డినేటర్‌గా రాజశేఖర్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ నియామక పత్రాన్ని రాజశేఖర్‌కు అందజేశారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా బస్తా రూ.270, గ్రోమోర్ 20:20:13 రూ.1140 ఉందని.. ఆసక్తి కల్గిన రైతులు ఆధార్ తీసుకొచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

చెక్కు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన అనూషకు రూ.19వేలు, సంతోష్‌కు రూ.55వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఈమేరకు గురువారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ సాలాయి నరేశ్ లబ్ధిదారులకు అందజేశారు.

గొర్రెలు పంపిణీ

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్వి పంచాయతీలోని మల్లాపూర్‌లో గురువారం ముగ్గురు లబ్ధిదారులకు రాయితీ గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బన్సపల్లి పీఏసీఎస్ చైర్మన్ పి.వి.రమణారెడ్డి, సర్పంచ్ అచ్చుత్‌రావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్దె అనిల్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుంటాల: అన్ని వర్గాల ప్రజలకు రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో 19 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 15 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి, తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, డీటీ నరేశ్‌గౌడ్, గజ్జారాం, వెంకటేశ్, సర్పంచులు సమత, ప్రవీణ్‌కుమార్, హైమద్, ఆనందరావు పటేల్,దాసరి కిషన్, ఎంపీటీసీ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు బీఆర్ఎస్‌లో చేరిక



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూరు: మండలంలోని సింగన్‌గాం గ్రామానికి చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు ముధోల్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామ ఉపసర్పంచ్ సుధాకర్‌తో పాటు వంద మందికిపైగా బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ సర్పంచ్ బాలాజీ, నంద్‌గాం సర్పంచ్ అబ్దుల్ గన్ని, కోఆప్షన్ సభ్యుడు గోవింద్ రామ్‌పటేల్ ఉత్తం బాలేరావ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సందల్

భైంసాటౌన్: పట్టణంలో ముస్లింలు గురువారం సందల్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి ఊరేగింపుగా వెళ్లి స్థానిక బీఫ్ మార్కెట్ వద్ద ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమెల్యే విఠల్‌రెడ్డి పాల్గొన్నారు. వారి వెంట బీఆర్ఎస్ పట్టణాధ్యక్షులు ఫారూక్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆసిఫ్, మైనార్టీ నాయకులు ఉన్నారు. అంతకుముందు పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణ తదితరులు ఉన్నారు.

నాయకులకు మంత్రి దిశానిర్దేశం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం మంత్రి ఐకేరెడ్డి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. శుక్రవారం వైద్య కళాశాల ప్రారంభోత్సవం, ఈనెల 25న మంత్రి కేటీఆర్ నిర్మల్‌కు రానున్న నేపథ్యంలో చేయాల్సిన సలహాలు, సూచనలు వివరించారు. సోన్ మండలం పాక్‌పట్లలో ప్రారంభించే ఆయిల్‌పాం ఫ్యాక్టరీ, పట్టణంలోని మోడ్రన్ స్మశాన వాటిక, పలు అభివృద్ధి కార్యక్రమాలు, అనంతరం ఏర్పాటు చేసే సభ, తదితర కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, అల్లోల మురళీధర్ రెడ్డి, పాకాల రాంచందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఐకేరెడ్డి

బీజేపీ నాయకుల నిరసన

భైంసాటౌన్: సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఉదయనిధిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ భైంసా పట్టణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం భైంసా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉదయనిధిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. పట్టణ అధ్యక్షుడు మల్లేశ్వర్, పోశెట్టి, వేణు, రమేశ్, నందు, శ్రీనివాస్, సంపత్ పటేల్, తదితరులు ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు.

లోకేశ్వరం: ఉదయనిధిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు సంటిన్నోల్ల గంగాధర్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు సుమన్‌కుమార్, రమేశ్, భూమన్న, కిషన్, సాయినాథ్, వెంకట్ ఉన్నారు.

ముధోల్: సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి పాండే డిమాండ్ చేవారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్‌చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ మండల అధ్యక్షులు పోతన్న, నాయకులు రమేశ్, రవికుమార్, అనిల్, భూషణ్, బాలు, గంగాధర్, శ్రీకాంత్ తదితరులున్నారు.



ఖానాపూర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

ఖానాపూర్: సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేస్తోందని పెంబి జెడ్పీటీసీ జాను బాయి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టిన దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో బీజేపీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పడాల రాజశేఖర్, పుప్పాల ఉపేందర్, ఆసం సాయికృష్ణ, ఇనుముల స్వామి, గోపాల్‌రెడ్డి, శంకర్, శేఖర్, శ్రీధర్, వేణు, కిరణ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేర్చాలి'

ఖానాపూర్: ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని ఆ సంఘం జిల్లా కోర్ కమిటీ సభ్యులు సాయన్న, గణేశ్, దేవేందర్, హరీశ్, మహేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని పీఆర్‌టీయూ భవనంలో ఆ సంఘ సమావేశం నిర్వహించగా.. వారు హాజరై మాట్లాడారు. వచ్చే నెల 2న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. జిల్లాలోని మత్స్యకార సొసైటీల్లో ఎలాంటి షరతులు లేకుండా ముదిరాజ్‌లకు సభ్యత్వం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మన్న, చంద్రశేఖర్, నర్సయ్య, మోహన్, నాగరాజు, వెంకటేశ్, మురళి, భీమలింగు, నరేశ్, రాజేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాంగ్రెస్‌లో పలువురి నియామకం

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్ఎస్‌యూఐ నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడిగా సయ్యద్ తాజుద్దీన్, కాంగ్రెస్ నిర్మల్ పట్టణ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మంగళారపు రాజును నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గురువారం శ్రీహరిరావు తన క్యాంపు కార్యాలయంలో వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రెసిడెంట్ ఎంబడి రాకేష్, డిస్ట్రిక్ట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సయ్యద్ అర్షద్ ఉద్దీన్ పాల్గొన్నారు.

పార్టీలో చేరిక..

నిర్మల్‌రూరల్ మండలం కొట్ల (కే) గ్రామస్తులు పలువురు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో తన క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

50 మంది రక్తదానం

ఖానాపూర్: రక్తదానం ఎంతో మంది ప్రాణాలను నిలబెడుతుందని నిర్మల్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్ రావు అన్నారు. గురువారం పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో టీం జననీ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సుమారు 50మంది యువకులు రక్తదానం చేశారు. చైర్మన్ రాజేందర్, జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామునాయక్, టీం జననీ ఫౌండేషన్ అధ్యక్షుడు తోట సుమిత్, న్యాయవాదులు వెంకటమహేంద్ర, కవిత, విశ్వాస్‌రెడ్డి, ఉమాదేవి, అమ్రిన్, ఎస్సై శంకర్, హరిత, ప్రతాప్, సురేశ్, కిషన్‌రెడ్డి ఉన్నారు.

అర్హులకు ఫలాలు అందించండి

ముధోల్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు దళితబంధు, బీసీ, మైనార్టీలకు రూ.లక్ష సాయం అందించాలని తెలంగాణ జన సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి సర్దార్ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ముధోల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా టీజేఎస్ ముధోల్ మండల అధ్యక్షుడిగా షేక్ మినాజ్, గిరిజన విభాగం మండల అధ్యక్షుడిగా రాథోడ్ శ్రీనివాస్, నాయక్‌ను నియమించారు. టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరాం, అశోక్, పాషా, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

'మీసేవ నిర్వాహకుడిపై చర్యలేవి'

పెంబి: గిరిజనుల నుంచి కులం, నివాసం, మరణం తదితర ధ్రువపత్రాల కోసం అదనంగా రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు వసూలు చేస్తున్న పెంబిలోని మీసేవ నిర్వాహకుడిపై తహసీల్దార్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మంచికంటి లక్ష్మణ్ అధికారులను ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు వెంకన్న, నరేశ్, నారాయణ, తదితరులు ఉన్నారు.

శాంతికమిటీ సమావేశం

కుంటాల: గణేశుడి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకొని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవా లని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. గురువారం మండలంలోని విఠాపూర్‌లో పలు మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చే సి న శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి రమేశ్, ఏఎస్సైలు దేవరావు, రాందాస్, తదితరులు పాల్గొన్నారు.



పట్టు తప్పిందా.. గోవిందా

నిత్యం ఎందరో అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నా.. కొందరిలో మాత్రం మార్పు రావడం లేదు. గురువారం జిల్లాకేంద్రంలోని శాంతినగర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఒకే బైక్‌పై ఐదుగురు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న దృశ్యాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్